

రామనాథపురంలో

హైడ్రో కార్బన్ బావులు



● ఓఎన్జీసీకి కేంద్రం అనుమతి

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో హైడ్రోకార్బన్ పథకం కింద 20 ప్రాంతాల్లో చమురు, సహజ వాయువు బావుల తవ్వకాలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ నిర్వహణలోని ఓఎన్జీసీకి అనుమతులు జారీ చేసినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. కేంద్ర ప్రభుత్వ కొత్త చమురు తవ్వకాల విధానంలో భాగంగా ఓఎన్జీసీ రామనాథపురం, శివగంగ జిల్లాల్లో 1403.41 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో హైడ్రోకార్బన్ సేకరణకు అనుమతులు పొందింది. ఆ మేరకు చమురు, సహజవాయువు సేకరణ పనుల్లో మొదటి విడతగా రామనాథపురం జిల్లాలోని తనిచ్చియం, పేయికుళం, కీల్‌సెల్వనూర్, వేపన్కుళం, పూక్కుళం, సడయనేరి, కీల్‌సిరుపోదు, వళ్లకుళం, పణయడియేళం, నళ్లిర్క్కై, అరియకుడి, కావనూర్, కామన్‌కోట, ఆలమళందార్, శీనంగుడి, అలగర్‌దేవన్‌కోట, అడందనార్‌కోట, ఏ.మనకుడి తదితర గ్రామాల్లో 2023లో నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. రూ. 675 కోట్లతో చమురు, సహజ వాయువుల బావులను 300 మీటర్ల లోతులో బావులు తవ్వేందుకు ఓఎన్జీసీ ప్రణాళిక రూపొందించి అనుమతి కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి దరఖాస్తు చేసింది. ఈ సంస్థ ఎంపిక చేసిన ప్రాంతాలను పరిశీలించిన మండలి తొలి విడతగా 20 ప్రాంతాల్లో ఈ పథకానికి అనుమతులిచ్చినట్లు ఓఎన్జీసీ అధికారులు తెలిపారు.

ఎండీఎంకే నిరసన...

రాష్ట్రంలో హైడ్రోకార్బన్ పథకానికి ఇచ్చిన అనుమతులను ఉపసంహరించుకోవాలని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల సమీపంలో ఉన్న సముద్రతీర ప్రాంతాల్లో చమురు, సహజవాయువు బావుల తవ్వకాలు జరిపితే సముద్ర సంపదతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందని, అందువల్ల ఈ పథకాన్ని రద్దుచేయాలని కోరారు. అలాగే పీఎంకే మాజీ ఎంపీ డాక్టర్ అన్బుమణి, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ కూడా హైడ్రోకార్బన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయం అత్యవసరం

మిత్ర పక్షాల సమావేశంలో సీఎం స్టాలిన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని కాపాడాలంటే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వంటి న్యాయకోవిదులు ఉపరాష్ట్రపతి పదవిలో ఉండాలని, అప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. టీనగర్‌లోని స్టార్ హోటల్‌లో సీఎం స్టాలిన్ అధ్యక్షతన డీఎంకే మిత్రపక్షాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్ని విధాలా అర్హుడని, తమిళ ప్రజల మనోభావాలకు గౌరవమిచ్చే వ్యక్తి ఆయనే అని చెప్పారు. ఎన్డీయే అభ్యర్థికి 'తిమిళుడు' అనే ముసుగు వేసి ఏన్డీయే మద్దతు కోరుతుండటం గర్హనీయమన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల నేతలే కాకుండా ప్రజాస్వామ్యంపై విశ్వాసం కలిగినవారంతా సుదర్శన్‌రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 1971లో న్యాయవాద వృత్తిని స్వీకరించి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదిగా, కేంద్ర ప్రభుత్వ తరపు న్యాయవాదిగా, మళ్ళీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, గోవా లోకాయుక్త అధ్యక్షుడిగా అంచెలంచెలుగా ఎదిగి న్యాయ వ్యవస్థలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, ప్రస్తుతం ఉపరాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించడానికి అన్ని విధాల అర్హత సంపాదించుకున్నారని తెలిపారు. ఇంతటి కీర్తిని సంపాదించుకున్న మహనీయుడిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నక్సలైట్ ముద్రవేయడం హేయమైన చర్య అని స్టాలిన్ మండిపడ్డారు. ద్రావిడ నేతలు, తమిళభాష, సంస్కృతికి శిరస్సు వహించి నమస్కరిస్తున్నానంటూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఉపరాష్ట్రపతిగా తనను గెలిపిస్తే రాజ్యాంగాన్ని కాపాడతానని, తాను నేను ఏ పార్టీకి చెందినవాడిని కానని. ఏ పార్టీలో చేరే ఆలోచన కూడా లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత సెల్వపెరుంతగై, డీపీఐ నేత తొల్‌తిరుమావళవన్, ఎండీఎంకే నేత వైగో, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ సహా ఆ పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ఈ సభలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని సత్కరించి, తిరువళ్లువర్ ప్రతిమను స్టాలిన్ కానుగా అందజేశారు. ఈ సమావేశం తర్వాత జరిగిన విందులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీఎం స్టాలిన్, డీఎంకే, మిత్రపక్షాల నాయకులు, ఎంపీలు పాల్గొన్నారు.




ఇన్‌ఛార్జి డీజీపీగా జి.వెంకట్రామన్?

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండటంతో ప్రస్తుతానికి ఇన్‌ఛార్జి డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జి.వెంకట్రామన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. శంకర్ జివాల్ పదవీ విరమణ తర్వాత కొత్త డీజీపీ పదవి ఎవరిని వరిస్తుందనే విషయమై పలు అంచనాలు తలెత్తాయి. సీనియారిటీ ప్రకారం సీమా అగర్వాల్, రాజీవ్‌కుమార్, సందీప్ రాయ్ రాథోడ్ తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. అభయ్ కుమార్ సింగ్, వన్నియపెరుమాళ్, మహేష్‌కుమార్ అగర్వాల్, వెంకట్రామన్, వినిత్‌దేవ్ వాంఖడే తర్వాత స్థానాల్లో ఉన్నారు. సాధారణంగా డీజీపీ పదవి ఖాళీ కావడానికి మూడు నెలల ముందు రాష్ట్రప్రభుత్వం సీనియారిటీ ప్రకారం ఆ పోస్టుకు అర్హులైన ఎనిమిది ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపాల్సి ఉంటుంది. ఆ జాబితాలో ఉన్నవారిలో ముగ్గురి పేర్లను ప్రతిపాదిస్తూ యూపీఎస్సీ ఓ జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతుంది. ఆ జాబితాలో ఉన్నవారిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈసారి డీజీపీ ఎంపికకు సంబంధించి ఇప్పటివరకూ ఎనిమిది మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపలేదు. ఎనిమిది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తమకు సానుకూలంగా వ్యవహించే వ్యక్తిని డీజీపీగా నియమించుకోవాలని భావిస్తుండటంతో కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియ చేపట్టలేదు. అదే సమయంలో డీజీపీగా శంకర్‌జివాల్‌ను మరో ఆరు నెలల పాటు ప్రభుత్వం కొనసాగిస్తుందని వార్తలు వెలువడ్డాయి. కానీ ఈ నెల 31న శంకర్‌జివాల్ పదవీ విరమణ చేయడం ఖాయమని చెబుతున్నారు. తదుపరి ఘట్టంగా ఐపీఎస్ అధికారి ప్రమోద్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించాల్సి ఉన్నా ఆయన పదవీ కాలం సెప్టెంబర్ నెలాఖరుతో ముగియనుండటంతో ఆయనను డీజీపీగా నియమించేందుకు ఆసక్తికనబరచడం లేదని తెలుస్తోంది. ఇక మిగిలిన సీనియారిటీ ప్రకారం సీమా అగర్వాల్, సందీప్‌రాయ్ రాథోడ్‌లో ఒకరు డీజీపీగా నియమితులవుతారని భావించారు.

అయితే వీరి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీ పరిశీలనకు పంపలేదు. ఆ తర్వాత అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) డీజీపీగా ఉన్న అభయ్‌కుమార్ సింగ్‌ను ఇన్‌ఛార్జి డీజీపీగా నియమించాలని ప్రభుత్వం భావించింది. కానీ చివరి క్షణంలో ఆ నిర్ణయాన్ని ఉప సంహరించుకుంది. ఇదిలా ఎండగా హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో డీజీపీ ఎంపిక వ్యవహారంలో ప్రస్తుతం రిటైర్‌కానున్న డీజీపీ సర్వీసును పొడిగించకూడదని, ఎవరినీ ఇన్‌ఛార్జి డీజీపీగాను నియమించకూడదని ప్రభుత్వానికి ఉత్తర్వు జారీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై విచారణ జరిగినప్పుడు ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తూ కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీని నియమించేలోగా ఇన్‌ఛార్జి డీజీపీని నియమించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలున్న అడ్మినిస్టేటివ్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ డీజీపీ వెంకట్రామన్‌ను ఇన్‌ఛార్జి డీజీపీగా నియమించనున్నట్లు తెలుస్తోంది.

మళ్లీ హస్తినకు గవర్నర్



అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి మళ్ళీ హస్తినకు వెళ్ళారు. శనివారం ఢిల్లీ వర్గాల పిలుపు మేరకు ఆయన ఆదివారం ఉదయం హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. ఈ నెల 20న ఢిల్లీ వెళ్ళిన ఆయన నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ పర్యటనపై ఆయన ఓ ట్వీట్ కూడా చేశారు. రాష్ట్ర రైతు సమస్యలు, వారి సంక్షేమ పథకాలపై కేంద్ర మంత్రులు, పెద్దలతో చర్చించినట్లు ఎక్స్ వేదికగా చేసిన ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆయన శనివారం సాయంత్రానికి నగరానికి చేరుకున్నారు. మళ్ళీ ఆదివారం ఉదయం 8.55 గంటలకు విమానంలో ఢిల్లీ వెళ్ళారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గవర్నర్ వరుసగా ఢిల్లీకి వెళ్ళి రావడం ఇపుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే, గవర్నర్ ఢిల్లీ వెళ్ళాల్సిన విమానం ఉద యం 8.55 గంటలకు బయలుదేరాల్సి వుండగా, ఆలస్యం గా 10.15 గంటలకు బయలుదేరి వెళ్ళింది.

సిద్ధ వైద్య వర్సిటీ బిల్లును

తిప్పి పంపిన గవర్నర్

● ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం



తెన్‌కాశి వడకరై పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న మంత్రి సుబ్రమణ్యం

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సిద్ధ వైద్య యూనివర్సిటీ బిల్లును రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి మళ్ళీ వెనక్కి తిప్పి పంపారని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి ఎం.సుబ్రమణ్యం వెల్లడించారు. ఆయన తిరునెల్వేలిలో శనివారం మీడియాతో మాట్లాడుతూ, సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటుపై బిల్లును రూపొందించి అసెంబ్లీలో ఆమోదించామన్నారు. ఈ బిల్లును రాష్ట్ర గవర్నర్ ఆమోదానికి పంపించగా, ఆయన నాలుగైదు సార్లు వెనక్కి తిప్పి పంపారన్నారు. ఈ నెల 21వ తేదీ నాలుగు సవరణలు చేసి గవర్నర్‌కు పంపించగా ఆయన మళ్ళీ తిప్పి పంపించారని తెలిపారు. దీంతో న్యాయ శాఖ సవరణల తర్వాత ఈ వారంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో ఆ బిల్లును ఆమోదిస్తామని వెల్లడించారు. నెల్లై ప్రభుత్వ వైద్య ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానర్ ఉందని, అవసరమైతే మరో స్కానర్ సమకూర్చుతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నర్సుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా మొత్తం 30 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కేసులపై త్వరలో తుది తీర్పు వస్తుందన్నారు. గత నాలుగు నెలల్లో 2642 వైద్య పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందని మంత్రి సుబ్రమణ్యం గుర్తుచేశారు. -

సొంత మెజారిటీతోనే అధికారంలోకి

ఈపీఎస్ ధీమా



ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో సొంత మెజారిటీ సాధించి అధికారంలోకి వస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని పార్టీ నిర్వాహకులు, ప్రజలను కలుసుకునేలా ఈపీఎస్ రాష్ట్ర వ్యాప్త పర్యటన చేపట్టారు. శనివారం తన మూడు రోజుల పర్యటనను తిరుచ్చిలో ఈపీఎస్ ప్రారంభించారు. ఆదివారం ఉదయం తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్ సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో అన్నాడీఎంకే నిర్వాహకులు, బూత్ కమిటీలతో వేర్వేరుగా సమావేశమై అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు, నియోజకవర్గాల్లో పార్టీ, మిత్రపక్షాల పట్ల ప్రజలు ఏమనుకుంటున్నారనే వివరాలను ఈపీఎస్ తెలుసుకున్నారు. బూత్ కమిటీలను పటిష్ఠం చేసి పార్టీ ఓటు బ్యాంకును పెంచే విధంగా జిల్లా నాయకులు ఇప్పటి నుండే పనులు ప్రారంభించాలని, కూటమి అభ్యర్థులు ఎవరైనా సరే వారికి మద్దతుగా ప్రచారం చేసి గెలిపించాలని ఆయన సూచించారు. అనంతరం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని, డీఎంకే కుటుంబ పాలనను గద్దెదిగే రోజులు దగ్గరపడుతున్నాయని విమర్శించారు.

విజయ్ ఎంత ప్రయత్నించినా

'కెప్టెన్' కాలేడు

● డీఎండీకే అధినేత్రి ప్రేమలత



పేద మహిళలకు కుట్టుమిషన్లను అందజేస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో 'కెప్టెన్' లాగా రాణించాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విమర్శించారు. కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపకులు విజయకాంత్ జయంతి వేడుకలను దారిద్ర్య నిర్మూలన దినంగా ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయకాంత్ చిత్రపటానికి పార్టీ నిర్వాహకులతో కలిసి ప్రేమలత నివాళులర్పించి లబ్దిదారులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల మదురైలో జరిగిన టీవీకే రెండో మహానాడులో విజయకాంత్‌ను తన సోదరుడని విజయ్ మాట్లాడారని, రాజకీయాల కోసం కెప్టెన్ పేరు ఉపయోగించుకుంటే ప్రజలు అంగీకరించరన్నారు. డీఎండీకేలో కెప్టెన్ వారసులు ఉన్నారని, వీరు కాకుండా మరెవ్వరూ కూడా కెప్టెన్ ఫొటోలు, పేరు రాజకీయ వేదికలపై వాడుకోకూడదన్నారు. విజయకాంత్ అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో ఆయనను పరామర్శించేందుకు రాని విజయ్ ప్రస్తుతం రాజకీయ లబ్ధికోసం ఆయన పేరు ఉచ్ఛరించడం సరికాదన్నారు. రాజకీయ అనుభవం లేని విజయ్ ముందు తన పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలో నేర్చుకోవాలని, ఇంట్లో నుండే రాజకీయాలు చేయాలనుకోవడం అవివేకమని ప్రేమలత విమర్శలు గుప్పించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయిని ఎక్సైజ్ సిబ్బందికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేర్వేరు చోట్ల దాదాపు 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వివరాలిలా... స్థానిక ఎగ్మూర్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన రైలులో ఓ మూలన ఉన్న 7 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. హౌరా నుండి శనివారం రాత్రి 9.45 గంటలకు ఎగ్మూర్ మీదుగా తిరుచ్చి వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్ 7వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌లో ఆగింది. ఆ రైలు బోగీలను తనిఖీ చేసిన ఆర్పీఎఫ్ సిబ్బంది ఓ బోగీలో పడివున్న ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కిలో చొప్పున ఏడు ప్యాకెట్ల గంజాయిని గమనించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఆదివారం ఉదయం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారనాశి నుండి ఎగ్మూర్ మీదుగా రామేశ్వరం వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్ 4వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌లో ఆగింది. రైలులోని ఓ బోగీలో రూ.50వేల విలువైన గుట్కా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు గంజాయి ప్యాకెట్లను ఆదివారం ఉదయం రైల్వేపోలీసులు ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

ఇదే విధంగా తాంబరం ప్రాంతంలో చట్టవిరుద్ధంగా గంజాయి విక్రయించిన ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు వారినుండి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాంబరం సమీపంలోని పళ్లికరణై, గౌరీవాక్కం తదితర ప్రాంతాల్లో ఉన్న కళాశాలల విద్యార్థులు, వలస కార్మికులకు కొంతమంది సంఘ విద్రోహులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా వేశారు. అప్పుడు పళ్లికరణై ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలో ఆటోలో దిగిన ముగ్గురిని అనుమానంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేసిన పోలీసులు వారి నుండి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుబడిన నిందితులు అన్నానగర్‌కు చెందిన కమలేష్ (24) శరవణన్ (44), అమర్ (24) అని తెలిసింది.

ఉదయనిధి

తప్పక సీఎం అవుతారు..!

● మంత్రి రఘుపతి జోస్యం



డిప్యూటీ సీఎం ఉదయనిధితో మంత్రి రఘుపతి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ అనంతరం డిప్యూటీ సీఎం ఉదయనిధి ముఖ్యమంత్రి పదవి చేపడతారని సహజ వనరుల శాఖ మంత్రి రఘుపతి తెలిపారు. తిరునల్వేలిలో జరిగిన బీజేపీ బూత్ కమిటీ నిర్వాహకుల మహానాడులో పాల్గొన్న కేంద్ర మంత్రి అమిత్ షా, రాబోయే ఎన్నికల్లో డీఎంకేను వేళ్లతో సహా పెకలించాలని పిలుపునిచ్చారు. అమిత్ షా వ్యాఖ్యలపై పుదుకోటలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రఘుపతి మాట్లాడుతూ... డీఎంకే మూలాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలుసుకోలేరన్నారు. ఎందుకంటే డీఎంకే మూలాలు లోతుగా ఉన్నాయని, వాటిని అమిత్ షా కూడా కనుక్కోలేరని ఎద్దేవా చేశారు. దేశ పరిస్థితులు వేరు, తమిళనాడు పరిస్థితులు వేరనే విషయం అమిత్ షా తెలుసుకునే రోజు త్వరలోనే రానుందన్నారు. రాబోయే ఎన్నికల్లో డీఎంకే మళ్లీ అధికారం చేపడుతుందని మంత్రి రఘుపతి తెలిపారు.

సమాచార దృష్టి

నేడు ప్లస్ వన్ రీ వాల్యుయేషన్ ఫలితాలు

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్లస్ వన్ సప్లిమెంటరీ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలు సోమవారం విడుదల చేయనున్నట్టు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది. జూలైలో ప్లస్ వన్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాలు ఇటీవల విడుదల కాగా, పలువురు విద్యార్థులు రీ వాల్యుయేషన్, రీ టోటలింగ్ కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫలితాలు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు, జాబితాలో నెంబరు లేని పక్షంలో, వారి మార్కుల్లో తేడాలు లేవని గమనించాలని పరీక్ష శాఖ తెలిపింది.

ఉచిత ఆధ్యాత్మిక యాత్ర

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముఖ్యమైన వైష్ణవాలయాలకు పురటాసి నెలలో 2వేల మంది భక్తులకు ఉచిత ఆధ్యాత్మిక యాత్ర ఏర్పాటుచేశారు. సెప్టెంబరు 20,27, అక్టోబరు 4,11 తేదీల్లో ఆయా మండలాల నుంచి యాత్ర బయల్దేరుతుంది. ఆసక్తి కలిగిన భక్తులు ఆయా మండల జాయింట్ కమిషనర్ కార్యాలయం, www.hrce.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు తగిన సర్టిఫికెట్ల నకళ్లు జతచేయాలి. మరిన్ని వివరాలకు హిందూ దేవాదాయ శాఖ వెబ్‌సైట్, 1800 425 1757 అనే టోల్ ఫ్రీ నెంబరు సంప్రదించవచ్చు.

నేటినుంచి 'గేట్' దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'గేట్' ప్రవేశ పరీక్షకు సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. 2026వ సంవత్సరానికి గేట్ పరీక్ష ఫిబ్రవరి 7,8,14,15 తేదీల్లో పాఠ్యాంశాల వారీగా ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఐఐటీ గౌహతి నిర్వహించనుండగా, పరీక్షా కేంద్రాలను 8 జోన్లుగా విభజించారు. అభ్యర్థులు ఈ నెల 25వ తేది https://gate2025.iitr.ac.in/ అనే వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 25వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

20 ఏళ్లు దాటిన వాహనాల ఫీజు పెంపు

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లు పైబడిన వాహనాలకు రెన్యువల్ ఫీజు పెరిగింది. ఆ ప్రకారం, తేలికపాటి వాహనాల రెన్యువల్ ఫీజు రూ.5,000 నుంచి రూ.10వేలకు పెంచారు. ద్విచక్రవాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రెన్యువల్ ఫీజు రూ.2వేలు, మూడు చక్రాల వాహనాల రెన్యువల్ రూ.5వేలకు పెంచారు.

డీఎంకే హయాంలో 5వేల కొత్త బస్సులు

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) డీఎంకే అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 5,000 కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందిచేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాలతో, 11వేల బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించామని, వాటిలో 5వేల బస్సులు ప్రస్తుతం అందుబాటులోకి రాగా, మిగిలినవి త్వరలో రానున్నాయని తెలిపారు.

30న అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 30న జరుగనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఉదయం సమావేశం జరుగుతుందని తెలిపింది.

సాధారణ బస్సులుగా డీలక్స్‌లు

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న 200 డీలక్స్ బస్సులను సాధారణ బస్సులుగా నడపాలని మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నిర్ణయించింది. ఎంటీసీలో కాలపరిమితి చెందిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు పరిచయం చేస్తున్నారు. ఆ ప్రకారం, ప్రస్తుతం 55 ఏసీ, 255 లో ఫ్లోర్ విద్యుత్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ బస్సులు డీలక్స్ ఛార్జీతో నడుపుతున్నారు. ఈ క్రమంలో, తెలుపు రంగు బోర్డు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం ఉండడంతో, వారి సౌకర్యార్థం డీలక్స్ బస్సులుగా నడుపుతున్న 200 ఎరుపు రంగు బస్సులను తెలుపు రంగు బోర్డు బస్సులుగా నడపనున్నట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

'అన్బు కరంగళ్' ఆర్థిక సాయానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'అన్బు కరంగళ్' ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయి బంధువుల రక్షణ పెరుగుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు 18వ సంవత్సరాల వరకు విద్య కొనసాగించేలా ప్రతినెలా రూ.2వేల ఉపకారవేతనం అందించనున్నారు. పాఠశాల విద్య పూర్తిచేసిన తర్వాత కళాశాల విద్య, సంబంధిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందించేలా రాష్ట్ర ప్రభుత్వం 'అన్బు కరంగళ్' పథకం అమలుచేస్తోంది. అర్హులైన పిల్లల బంధువుల కుటుంబ కార్డు, పిల్లల ఆధార్ కార్డు, పిల్లల జనన ధృవీకరణ పత్రం, పిల్లల బ్యాంక్ ఖాతా పుస్తకం నకళ్లతో ఆయా ప్రాంతాల్లో జరిగే 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల్లో వినతి ప్రతాలు సమర్పించవచ్చని, అలాగే గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఉన్న జిల్లా బాలల రక్షణ కార్యాలయాన్ని సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

మేట్టూరుకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంలో ప్రవాహం తగ్గింది. కర్ణాటక రాష్ట్రం కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంలకు నీరు చేరడంతో, రెండు డ్యాంల నుంచి 1.25 లక్షల ఘనపుటడుగుల నీరు కావేరి నదిలోకి విడుదల చేశారు. ఈ నీరు రాష్ట్ర సరిహద్దులైన పిల్లిగుండు, హొగెనేకల్ మీదుగా మేట్టూరు డ్యాం చేరుకున్నాయి. డ్యాం పూర్తి సామర్థ్యం 120 అడుగులకు చేరుకోవడంతో, అదనపు జలాలను 16 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలో, శనివారం డ్యాంలోకి నీటి రాక 10,850 ఘనపుటడుగులకు తగ్గడంతో నీటి విడుదల నిలిపివేశారు.

మేళట్టూరులో కోలాహలంగా విఘ్నేశ్వరుడి తిరుకల్యాణం


వినాయకుడి కల్యాణఘట్టం

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పాపనాశం సమీపంలోని మేళట్టూరులో ప్రసిద్ధి గాంచిన సిద్ధి, బుద్ధి దక్షిణామూర్తి వినాయకుడి తిరుకల్యాణ మహోత్సవం ఆదివారం ఉదయం కోలాహలంగా జరిగింది. ఈ ఆలయంలో వినాయక చతుర్థి వేడుకలు ఈ నెల 18న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 7వ రోజు ఆదివారం వినాయకుడికి సిద్ధి,బుద్ధితో ఆలయ అర్చకులు వివాహ క్రతువు నిర్వహించారు. భక్తులు సారె తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగగుండంలో హోమం, శంకుపూజ, సంప్రదాయ పూజలు జరిపారు. మంగళవాయిద్యాల మధ్య స్వామివారికి సిద్ధి, బుద్ధిలతో వివాహం జరిపించారు. ఈ వైభవంలో తిరువాడుదురై ఆధీనం అంబళవాన దేశిక పరమాచార్య స్వామి హాజరై తిరుకల్యాణంపై ఉపన్యసించారు. చివరగా భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పారివాక్కం: కన్నపాళయం, ఆయిల్‌చేరి, పిడారితాంగళ్, పానవేడుతోట్టం, కొలంపచేరి

తేనాంపేట: ఎల్లైఅమ్మన్ కాలనీ, పోయస్ గార్డన్ జేజే రోడ్డు, కేఆర్ రోడ్డు, మురేష్ గేట్ రోడ్డు, శాస్త్రి రోడ్డు, బషీర్ అహ్మద్ వీధి, అంబుజమ్మాళ్ వీధి, ఎస్ఎస్ అయంగార్ వీధి, వీనస్ కాలని 1,2 వీధులు, మహారాజ రోడ్డు

కోవిలంబాక్కం: వెల్లంక్కల్, వడక్కుపట్టు, ఎస్.కొళత్తూర్, ఈచ్చంగాడు, గాంధీ నగర్, సత్య నగర్, ఎంజీఆర్ నగర్

నన్మంగళం: హస్తినాపురం రోడ్డు, అంబేద్కర్ రోడ్డు, మేడవాక్కం మెయిన్ రోడ్డు

తాంబరం: ముడిచూర్ కృష్ణా నగర్, బాలాజి నగర్, గోపాల్ నగర్, ఏఎల్ఎస్ గ్రీన్ ల్యాండ్, భరత్ నగర్, ముల్లై నగర్, కనకమ్మాళ్ ఆలయ వీధి, విజయ నగర్, నెహ్రూ నగర్, పాంబన్ స్వామిగళ్ రోడ్డు, సీవీ రామన్ వీధి, లెనిన్ వీధి, యూవీ స్వామినాధన్ వీధి, వెల్లియమ్మై వీధి, సుధా అవెన్యూ, కస్తూరిబాయ్ వీధి, నిషా అవెన్యూ

అప్పు చెల్లించలేదని దంపతుల నిర్బంధం

● ఇద్దరి అరెస్టు


నిందితులు భాస్కరన్, తమిళ్వానన్

తిరుత్తణి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పుపై వడ్డీ చెల్లించలేదనే కారణంతో భార్యాభర్తలు సహా ఏడాదిన్నర చిన్నారిని లాడ్జీలో బంధించిన సంఘటన తిరువళ్లూరు జిల్లా అరక్కోణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తిరుత్తణిలోని సాయిబాబానగర్‌కు చెందిన పృథ్వీరాజ్ వర్మ (30) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో తన కుటుంబ అవసరాల కోసం అరక్కోణంలోని భాస్కరన్ (52)అనే వడ్డీ వ్యాపారి వద్ద రోజువారీ చెల్లింపు విధానంలో రూ.50వేలు రుణం కోసం వెళ్లగా, రూ.15వేలు వడ్డీ కింద జమచేసుకుని కేవలం రూ.35వేలు ఇచ్చి, రోజుకు రూ.600 లెక్కన 84 రోజులపాటు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో పృథ్వీరాజ్ వర్మ వడ్డీవ్యాపారికి 35 రోజులపాటు క్రమం తప్పకుండా నగదు చెల్లించారు. ఇదిలావుండగా తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో గత 10రోజులుగా నగదు చెల్లించలేదు. దీంతో ఆగ్రహించిన వడ్డీవ్యాపారి అతడిని వేధించినట్టట సమాచారం. తనకు ఆర్థిక ఇబ్బందులున్నాయని, కొంత సమయం ఇస్తే తీసుకున్న రుణం మొత్తం చెల్లిస్తానని ఎంత చెప్పినా వినకుండా భాస్కర్ శుక్రవారం ఉదయం అరక్కోణంలోని ఓ లాడ్జీకి భార్యతో కలిసి రమ్మని చెప్పగా పృథ్వీరాజ్ వర్మ, అతని భార్య స్వాతి (27), ఏడాదిన్నర చిన్నారితో ఆ లాడ్జికి వెళ్లారు. గదిలోకి వెళ్లగానే బయటి నుండి తలుపులేసి, తీసుకున్న అప్పు చెల్లించకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదని వాళ్లను బంధించివేశారు. రోజంతా గదిలో బంధించిన అనంతరం బాధితుడు ఇంటికెళ్లి నగదు తీసుకొస్తానని వేడుకోగా, అతడి భార్య స్వాతి, చిన్నారిని వేరే గదిలో బంధించి అతడిని మాత్రం బయటికి పంపారు. వెంటనే బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటన గురించి వివరించగా, సీఐ మదియరసన్ నేతృత్వంలోని పోలీసు బృందం అరక్కోణంలోని ఆ లాడ్జీకి చేరుకుని భార్యాభర్తలను బంధించిన వడ్డీవ్యాపారి భాస్కరన్, దీనికి సహకరించిన తమిళ్వానన్, దీపక్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పరిహార పూజల పేరిట చేతివాటం: పూజారి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పరిహార పూజలంటూ మహిళ నుంచి 2 సవర్ల నగ కాజేసిన పూజారిని పోలీసులు అరెస్ట్ చేశారు. అంబత్తూర్ టీచర్స్ కాలనీకి చెందిన ఓ మహిళ అంబత్తూర్ ఎంకేబీ నగర్‌లోని నాగాత్తమ్మన్ ఆలయానికి తరచుగా వెళ్తుంది. ఆ ఆలయ పూజారి లోకేష్, 'మీ ఇంట్లో కలశం ఉంచి పరిహార పూజలు చేస్తే కష్టాలు తీరుతాయి' అంటూ తెలిపారు. ఆయన మాటలు నమ్మిన ఆ మహిళ పరిహార పూజలు చేసేందుకు పూజారిని ఇంటికి తీసుకెళ్లింది. కలశంలో ఆమె ధరించిన 2 సవర్ల నగ వేయాలని సూచించిన పూజారి, పూజ అయిన తరువాత తాను చెప్పేంతవరకు నగ బయటకు తీయవద్దని సూచించాడు. ఈ క్రమంలో, నెల రోజులు గడిచినా లోకేష్ నుంచి ఎలాంటి సూచన రాకపోవడంతో ఆ మహిళ కలశాన్ని తెరచి చూడగా, అందులో నగ కనిపించకపోవడంతో దిగ్భ్రాంతి అంబత్తూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, లోకేష్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

విజయ్ రాజకీయ అజ్ఞాని

● మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్



ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అనే రాజకీయ పార్టీని స్థాపించిన సినీ నటుడు విజయ్ రాజకీయ అజ్ఞాని అని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్ వ్యాఖ్యానించారు. కోవై జిల్లా పొల్లాచ్చిలో ఆదివారం నిర్వహించిన అన్నాడీఎంకే జిల్లా నేతల సమావేశంలో పొల్లాచ్చి జయరామన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ మృతిచెందిన తర్వాత అన్నాడీఎంకే, రెండాకుల ఎన్నికల గుర్తు ఉంటాయా? అని పలువురు అవహేళన చేశారని, అయితే వీటి గురించి ఆలోచించకుండా పార్టీ పగ్గాలు చేపట్టడంతో పాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలిత రాష్ట్రప్రజలకు ఎనలేని సేవచేశారని కొనియాడారు. మదురై టీవీకే మహానాడులో అన్నాడీఎంకే వ్యవస్థాపకులు ఎంజీఆర్ గురించి మాట్లాడిన విజయ్ రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారని, ఎంజీఆర్ లాగా ఆయన రావాలనుకోవడం జరిగేపని కాదన్నారు. ఎంజీఆర్,జయలలిత సినీ, రాజకీయ రంగాల్లోనూ చక్రం తిప్పి ప్రజల గుండెల్లో చరగని ముద్రవేసుకున్నారని, వారికి సాటి మరెవ్వరూ లేరన్నారు. ఆ మహనీయుల అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎడప్పాడి పళనిస్వామి పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారన్నారు. అన్నాడీఎంకేను విజయ్ లాంటి రాజకీయ అజ్ఞానులు విమర్శించినంత మాత్రాన ఎలాంటి నష్టంజరగదని, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎడప్పాడి సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఆస్తిపన్ను పెంపు జీవోపై పిటిషన్

● రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి 6శాతం ఆస్తిపన్ను పెంపునకు అనుకూలంగా జారీచేసిన జీవోకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నగరానికి చెందిన హరీష్ చౌదరి హైకోర్టులో ఆస్తి పన్ను పెంపునకు సంబంధించిన జీవోకు వ్యతిరేకిస్తూ ప్రజావాజ్యం దాఖలుచేశారు. అందులో కార్పొరేషన్ నిబంధనల ప్రకారం ఐదేళ్లకు ఒకసారి మాత్రమే ఆస్తి పన్ను పెంచాల్సివుందని, అయితే తమిళనాడు ప్రభుత్వం ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి ఆరు శాతం చొప్పున ఆస్తిపన్ను పెంచుతూ 2024, సెప్టెంబర్ 5న జీవో విడుదల చేసిందని, ఈ రకంగా పన్ను పెంచే ముందు ప్రజాభిప్రాయం తెలుసుకోవాల్సివుందని, అయితే ఇవేవీ లేకుండా జారీచేసిన జీవోను రద్దుచేయాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్ మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఎం.శ్రీవాత్సవ, జస్టిస్ సుందరమోహన్‌తో కూడిన ప్రథమ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్లను పరిశీలించిన ధర్మాసనం నాలుగు వారాల్లోపు ఈ పిటిషన్‌కు సమగ్ర వివరాలతో కూడిన వివరణ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసింది.

విమాన సిబ్బందితో అన్నాడీఎంకే నేత వాగ్వాదం

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి మదురై వెళ్ళే విమానంలో ఎక్కిన అన్నాడీఎంకే నాయకుడు విమాన మహిళా సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఆయన ప్రయాణాన్ని రద్దు చేసిన విమాన సంస్థ, అతడిని విమానం నుంచి దించేశారు. మదురైకు చెందిన జయచంద్రన్ (65) అన్నాడీఎంకే అనుబంధ విభాగమైన ఎంజీఆర్ మండ్రం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన శనివారం సాయంత్రం మదురై వెళ్ళేందుకు ఇండిగో విమానం ఎక్కి, విమానంలో ఉద్యోగిణితో వాగ్వాదానికి దిగారు. తన లగేజీని విమాన క్రూ సిబ్బంది ఒక చోట నుంచి మరో చోటుకు మార్చడంతో ఆగ్రహించి వాగ్వాదానికి దిగారు. ఎంత చెప్పినా వినిపించుకోకపోవడంతో విమాన సిబ్బంది ఆయన ప్రయాణాన్ని రద్దు చేసి, కిందకు దించేశారు.. ఈ ఘటనపై ఇండిగో మేనేజర్ ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి, లిఖిత పూర్వకంగా వివరణ తీసుకుని వదిలివేశారు.


పెళ్లికి నిరాకరించిన ప్రియుడు

● ఆత్మహత్య చేసుకున్న దివ్యాంగురాలు

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించి, కొంతకాలం పాటు కలిసి జీవించిన తర్వాత ప్రియుడు పెళ్ళికి నిరాకరించడంతో తీవ్ర మనోవేదనకు గురైన దివ్యాంగురాలు ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన రాయపురంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రాయపురం కల్ మండపానికి చెందిన దివ్యాంగురాలు (25) గత యేడాదిన్నరగా వేప్పేరికి చెందిన దర్శన్ (26)ను ప్రేమిస్తోంది. ఈ క్రమంలో వీరిద్దరూ గత కొన్ని రోజులుగా సహజీవనం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరు కుంటుంబ సభ్యులు ఫిబ్రవరి 12న నిశ్చితార్థం కూడా చేశారు.. ఇదిలావుండగా వారం రోజులుగా ఈ ప్రేమికుల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. తన నడవడిక మంచిదికాదని, అందువల్ల ఈ పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదని ఆ యువతికి దర్శన్ చెప్పాడు. ఈ మాటలతో విరక్తి చెందిన యువతి శనివారం రాత్రి 7 అంతస్తు నుంచి కిందికి దూకి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ప్రియుడు దర్శన్‌ను అరెస్టు చేశారు.

జగదీప్ ధన్‌కర్ ఏమయ్యారు...?

● సీపీఎం ఎంపీ వెంకటేశన్



పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఏమయ్యారని సీపీఎం ఎంపీ వెంకటేశన్ తన ఎక్స్ పేజీలో పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాలం సమావేశాలు జూలై 21వ తేది ప్రారంభం కాగా, తొలిరోజునే ఊహించని విధంగా జగదీప్ ధన్‌కర్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయినా, ప్రతిపక్షాల నిర్బంధంతోనే ఆయన రాజీనామా చేశారని బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ఆరోపించింది. అదే సమయంలో, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఎక్కడున్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది? అంటూ ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ నేపథ్యంలో, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ను గృహ నిర్బంధం చేశారని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎంపీ వెంకటేశన్ తన ఎక్స్‌లో... జగదీప్ ధన్‌కర్ ఏమయ్యారు? అదే పరిస్థితి సీపీ రాధాకృష్ణన్‌కు సంభవిస్తుందా? అని తాము ఆందోళన చెందుతున్నామన్నారు. రాష్ట్రానికి చెందిన వ్యక్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని ఎంపీ వెంకటేశన్ పోస్ట్ చేశారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

● డ్రిల్ మాస్టర్ అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన డ్రిల్ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. విల్లుపురం ప్రాంతంలోని ఓ పాఠశాలలో శివబాలన్ (48) కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రిల్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన 7వ తరగతి చదువుతున్న విద్యార్థినులను వ్యాయామం పేరుతో మైదానానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. దీనిపై బాధిత బాలికలు తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు విల్లుపురం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి డ్రిల్ మాస్టర్‌ను అరెస్ట్ చేశారు.

కొత్తగా పార్టీ ప్రారంభించిన వారు కార్మికుల సంక్షేమంపై మాట్లాడరు

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సౌందర్‌రాజన్

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా పార్టీ ప్రారంభించిన నేతలు కూడా కార్మికుల గురించి ప్రస్తావించడం లేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సౌందర్‌రాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. పలు సమస్యల సాధనకు రాష్ట్ర రవాణా సంస్థ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సేలం కొత్త బస్టాండ్ సమీపం మెయ్యనూరు డిపో వద్ద చేపట్టిన ధర్నా శనివారం 6వ రోజు కొనసాగించింది. ఈ ధర్నాలో పాల్గొన్న సౌందర్‌రాజన్ మాట్లాడుతూ.. రవాణా శాఖ కార్మికులకు అందాల్సిన అన్ని ప్రయోజనాలు పొందే వరకు ధర్నా కొనసాగిస్తామన్నారు. చెన్నై పారిశుధ్య కార్మికులు చేపట్టిన పోరాటంలో, వారి ఒక్క కోరిక కూడా నెరవేరలేదన్నారు.

మద్యం మత్తులో అమెరికా పర్యాటకుడి రభస

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అమెరికా పర్యాటకుడు మత్తులో రభస చేశాడు. ఈ ప్రయాణికుడు తగిన ఆధారాలు లేకుండా ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో విమాన అధికారులు, సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. పోలీసులు అతడిని స్టేషన్ తరలించారు.

ప్రజారోగ్యం కోసమే 'నలం కాక్కుమ్ స్టాలిన్' శిబిరాలు

● ఎమ్మెల్యే ఎస్.చంద్రన్


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తిరుత్తణి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'నలం కాక్కుమ్ స్టాలిన్' శిబిరం ద్వారా ప్రజలకు జనరల్ వైద్యం, ఎముకల సంబంధిత సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల సహా 17 విభాగాల్లో వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే చంద్రన్ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో ఓ ప్రైవేటు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 'నలం కాక్కుమ్ స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పలు రకాల పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి ప్రియారాజ్, జాయింట్ డైరెక్టర్ అంబికా షణ్ముగం, డిప్యూటీ డైరెక్టర్ శేఖర్, మండల వైద్యశాఖ అధికారి ధనుంజయ చెళియన్ సహా పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

తండ్రీకూతుళ్ల నిజాయితీ

● దొరికిన నగదు పోలీసులకు అప్పగింత


ఇన్‌స్పెక్టర్‌కు నగదు అప్పగిస్తున్న సెల్వరాజ్, విద్య

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన దొరికిన నగదును పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన తండ్రి, కుమార్తెను అధికారులు, పోలీసులు అభినందించారు. తిరుప్పూర్ జిల్లా కాంగేయం ప్రాంతానికి చెందిన సెల్వరాజ్ (55) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కుమార్తె విద్య (28) టీఎన్‌పీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతోంది. తండ్రి, కుమార్తె కలిసి శనివారం కాంగేయం బస్టాండ్ సమీపంలో దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో రోడ్డు పక్కన ఉన్న సంచి పరిశీలించగా, అందులో రూ.1.50 లక్షల నగదు గుర్తించి, కాంగేయం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. 'ఇతరుల సొమ్ము తమకు అవసరం లేదని, తాము కష్టపడి సంపాదించుకున్న సొమ్ము తమకు చాలని' సెల్వరాజ్, విద్య పోలీసులకు తెలిపారు. వారిద్దర్నీ అధికారులు, పోలీసులు అభినందించారు. నగదు పోగొట్టుకున్న వారి కోసం విచారిస్తున్నారు.

అంకాళ పరమేశ్వరికి విశేషపూజలు


అమ్మవారికి విశేషపూజలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ గిరియప్పరోడ్డులో ఉన్న అంకాళ పరమేశ్వరి అమ్మవారి 50వ వార్షిక ఆవణి మాస ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అభిషేక, అలంకారపూజలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అంబళి ప్రసాదంగా పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ పి.చిన్నయ్య అలియాస్ అర్ముగం-లత దంపతుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో ఎస్ఎన్.జయ మురుగన్, స్టెల్లింగ్ జార్జ్, మాజీ కౌన్సిలర్ కర్పగం తదితరులు విశేషపూజలు నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని సేవించుకున్నారు.

ఈ ఏడాది 47.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 47.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆహార, ఆహార వస్తువుల సరఫరా శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. దిండుగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే పాలనలో 376 రైస్ మిల్లులుండగా, డీఎంకే ప్రభుత్వంలో 700 రైస్ మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. అన్నాడీఎంకే హయాంలో రైస్ మిల్లుల్లో 6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లింగ్ చేయగా, డీఎంకే హయాంలో 12 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని తెలిపారు. అన్నాడీఎంకే హయాంలో వరి క్వింటాలు ధర రూ.1,960గా ఉందన్నారు. సెప్టెంబరు 1వ తేది నుంచి ప్రారంభం కానున్న కొనుగోలు సీజన్‌లో వరి చిన్న రకానికి రూ.2,545, ఇతర రకాలకు రూ.2,500 అందించనున్నామని, ఎన్నికల హామీల్లో భాగంగా ప్రస్తుతం రూ.45 అదనంగా అందజేయనున్నట్లు మంత్రి చక్రపాణి తెలిపారు.

చెత్తపై పన్ను... వ్యతిరేకంగా అన్నాడీఎంకే ప్రచారం


ఇంటింటి ప్రచారంలో అన్నాడీఎంకే నేతలు

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెత్తకు పన్ను విధించిన రాష్ట్రప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ఉత్తర చెన్నై తూర్పు జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆదేశాల మేరకు ఉత్తర చెన్నై తూర్పు జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ అధ్యక్షతన కొరుక్కుపేట 42వ వార్డు పరిధిలోని వీధుల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, చెత్తకు విధించిన పన్నును ఉపసంహరించుకోవాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్.శ్రీనివాస బాలాజీ, లయన్ షణ్ముఖ వినాయకం, ఎం.వేలు, గౌరీ, దాక్షయణి తదితర పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు.

'వాట్ బ్రో... ఇదంతా చానా ఓవర్ బ్రో..!

● మదురైలో విజయ్‌కి వ్యతిరేకంగా పోస్టర్లు



మదురైలో డీఎంకే శ్రేణులు అతికించిన పోస్టర్లు

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మదురైలో పార్టీ మహానాడు సందర్భంగా డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకుడు విజయ్ పదే పదే 'అంకుల్... అంకుల్... వరస్ట్ అంకుల్' అంటూ విమర్శలు చేయడాన్ని ఖండిస్తూ మదురై నగరమంతటా ఆదివారం ఉదయం డీఎంకే శ్రేణులు గోడలపై అతికించిన పోస్టర్లు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఆ పోస్టర్లలో 'వాట్ బ్రో, ఇదంతా చానా ఓవర్ బ్రో... కాస్తా సౌండ్ తగ్గించండి బ్రో' అంటూ ముద్రించారు. మదురై నుండి తిరుప్పరంకుండ్రం దాకా గోడలపై వందల సంఖ్యలో పోస్టర్లు అతికించారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలోనూ తీవ్రంగా వైరల్ అవుతోంది.

కోలుకుంటున్న సీపీఐ నేత నల్లకన్ను


చికిత్సపొందుతున్న నల్లకన్ను

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను కోలుకుంటున్నారని వైద్యులు ప్రకటించారు. నందనంలోని తన నివాసంలో శుక్రవారం కాలుజారి పడి తలకు గాయాలైన కారణంగా నల్లకన్నును కుటుంబ సభ్యులు నందనంలోని వెంకటేశ్వర ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆయన తలలో కుట్లు వేసి అత్యవసర చికిత్సా విభాగంలో వైద్యుల బృందం చికిత్స అందిస్తోంది. వందేళ్లు దాటిన నేపథ్యంలో, వృద్ధాప్య కారణంగా శరీరంలో ఏర్పడిన కొన్ని సమస్యలకు చికిత్స అందించేందుకు న్యూరాలజీ, కార్డియాలజీ విభాగాలకు చెందిన నిపుణుల బృందం చికిత్సతో నల్లకన్ను కోలుకుంటున్నారని, ఒకటి రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని వెంకటేశ్వర ఆస్పత్రి అధికారులు తెలిపారు.

పల్లావరంలో నాలుగడుగుల గొయ్యి

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలోని పెరియ పాలయత్తమ్మన్ రోడ్డులో ఆకస్మికంగా నాలుగడుగుల గొయ్యి పడింది. దీంతో వాహనదారులతో పాటు స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. నగర శివారు ప్రాంతంతో శనివారం వేకువజామున భారీ వర్షం కురిసిన విషయం తెల్సిందే. దీంతో పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. ఇదిలావుండగా పెరియపాలయత్తమ్మన్ సాలైలో నాలుగడుగుల మేర గొయ్యి ఏర్పడింది. కొన్ని నెలల క్రితం ఈ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను తాంబరం కార్పొరేషన్ నిర్మించింది. ఈ కారణంగానే ఈ గొయ్యి ఏర్పడివుంటుందని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. కాగా, గొయ్యిని కార్పొరేషన్ సిబ్బంది తక్షణం పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సెల్వ కుమార్ దర్శకత్వంలో '18 మైల్స్'

సెల్వ కుమార్ దర్శకత్వంలో అశోక్ సెల్వన్ - మిర్నా జంటగా నటిస్తున్న చిత్రానికి '18 మైల్స్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ప్రేమ అనేది ఒక యూనివర్శల్ లాంగ్వేజ్. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశ, రాష్ట్రాలు, అంతర్జాతీయ జలాల సరిహద్దులు ఇలా ఎన్నో అడ్డంకులున్నాయి. వీటి నేపథ్యంలో అంతర్జాతీయ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. తాత్కాలికంగా షెల్టర్ కోరుకునే శరణార్థి.. అంతర్జాతీయ సముద్రపు చట్టాలను బలంగా నమ్మే ఒక వ్యక్తి హృదయంలో స్థానం సంపాదిస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ కథ. సముద్రంలాగే ప్రేమ కూడా ఎంతో అందమైనది. లోతైనది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేమికులు ఈ కథతో ఖచ్చితంగా కనెక్ట్ అవుతారని గట్టిగా భావిస్తున్నాం అని పేర్కొన్నారు.



'18 మైల్స్'లో అశోక్ సెల్వన్ - మిర్నా

'కాంచన-4' తర్వాత మరిన్ని అవకాశాలు

● నోరా ఫతేహి



రాఘవ లారెన్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కాంచన-4' చిత్రం తర్వాత కోలీవుడ్‌లో మరిన్ని సినిమాల్లో నటించేందుకు తనకు అవకాశాలు వస్తాయని, తనను సినిమాల్లో బుక్ చేసుకునేందుకు కోలీవుడ్ దర్శక నిర్మాతలు పోటీ పడతారని బాలీవుడ్ నటి నోరా ఫతేహి అంటున్నారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'తమిళంలో 'కాంచన' మూవీ నాలుగో భాగంలో నటిస్తున్నాను. ఈ మూవీ ఘన విజయం సాధించనుంది. అందువల్ల ఈ సినిమా విజయం సాధించిన తర్వాత తమిళంలో అనేక అవకాశాలు వస్తాయని, ముఖ్యంగా కోలీవుడ్ నిర్మాతలు నన్ను బుక్ చేసుకునేందుకు గాలిస్తారు. అలాంటి మంచి పాత్రలో 'కాంచన'లో నటిస్తున్నాను. పైగా ఆ చిత్రం ఖచ్చితంగా ఓ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. 2020లో వచ్చిన కాంచన మూవీని రాఘవ లారెన్స్ హిందీలోకి రీమేక్ చేసున్నారు. మరోవైపు తమిళంలో 'కాంచన-4' తెరకెక్కిస్తున్నారు. ఇందులో పూజా హెగ్డే, నోరా ఫతేహిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు.

విశాల్ కొత్తం చిత్రం 'మగుడం'

చిత్రజ్యోతి



'పురట్చి దళపతి' విశాల్ హీరోగా నటించే కొత్త చిత్రానికి 'మగుడం' అనే టైటిల్ ఖరారు చేశారు. ప్రముఖ సీనియర్ నిర్మాత ఆర్‌బీ చౌదరి సూపర్ గుడ్ ఫిలిమ్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది ఆ నిర్మాణ సంస్థ నిర్మించే 99వ చిత్రం కాగా, విశాల్ నటించే 35వ చిత్రం. రవి అరసు దర్శకుడు. విశాల్ సరసన దుషార విజయన్, అంజలి హీరోయిన్లుగా నించనుండగా, యోగిబాబు ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ కొత్త చిత్రం టీజర్‌ను చిత్ర బృందం ఆదివారం రిలీజ్ చేశారు. ఈ సినిమా షూటింగ్ జూలైలో ప్రారంభమైన విషయం తెల్సిందే. రెండో దశ షెడ్యూల్ ఊటీలో జరుపుకుంటోంది. విశాల్ హీరోగా నటించిన 'మదగద రాజా' అనే చిత్రం 12 యేళ్ళ తర్వాత విడుదలై ఏకంగా రూ.50 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టిన విషయం తెల్సిందే. ఆ తర్వాత విశాల్ 'తుప్పరివాలన్-2'లో నటిస్తారనే ప్రచారం సాగింది. కానీ, ఆ ప్రాజెక్టులో కాకుండా, 'మగుడం' చిత్రంలో నటించారు. ఇదే టైటిల్‌తో 1992లో ఓ చిత్రం వచ్చింది. ఇందులో సత్యరాజ్, భానుప్రియ, గౌతమి జంటగా నటించారు. ఆ సినిమా పేరుతో 33 యేళ్ళ తర్వాత ఇపుడు మళ్ళీ తీస్తున్నారు.



అశోక్ సెల్వన్ సరసన నిమిషా సజయన్

ప్రముఖ హీరో అశోక్ సెల్వన్ సరసన యంగ్ హీరోయిన్ నిమిషా సజయన్ నటించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మిలియన్ డాలర్ స్టూడియోస్, వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నూతన దర్శకుడు మణికంఠన్ ఆనందన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కొత్త చిత్రం పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో హీరో శశికుమార్, దర్శకుడు ఐరా శరవణన్ తదితరులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సినిమాలో విభిన్న పాత్రలు పోషిస్తున్న నటుడు అశోక్ సెల్వన్ ఈ చిత్రంలో కూడా విభిన్నమైన పాత్ర పోషించనున్నారు. ఈ కొత్త చిత్రం షూటింగ్‌ను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయనున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నారు. ఇందులో ఇతర నటులు, సాంకేతిక వర్గాల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

పిళ్లైయార్‌పట్టి ఆలయంలో గజాసుర సంహారం



గజాసుర సంహారానికి హాజరైన భక్తులు

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గణేశుడు కొలుదీరిన ఆలయాల్లో ప్రధాన క్షేత్రమైన పిళ్లైయార్‌పట్టి కర్పగ వినాయకుడి ఆలయంలో ఈ నెల 18 నుండి చతుర్థి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ప్రతిరోజు గజముఖస్వామి వివిధ వాహనాల్లో ఊరేగుతున్నారు. ఆరో రోజు కార్యక్రమంగా శనివారం రాత్రి గజాసుర సంహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి గజవాహనంలో లంబోదరుడిని ఆశీనుడిని చేసి తెప్పకుళం పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం మూలవిరాట్ నుండి తీసిన ఏనుగు దంతంతో అసుర సంహార కార్యక్రమం జరిగింది. ఆదివారం స్వామివారు నెమలి వాహనంలో విహరించిన స్వామివారు, సోమవారం వెండి అశ్వ వాహనంలో పురవీధుల్లో విహరించనున్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం స్వామివారి రథోత్సవం జరుగనుంది. పిళ్లైయార్‌పట్టి ఆలయంలో సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే నిర్వహించే చందనాలంకారంలో మూలవర్ వినాయకుడి దర్శనం భక్తులకు కల్పిస్తారు. రథోత్సవం సందర్భంగా సాయంత్రం 4.30 నుండి రాత్రి 10 గంటల వరకు స్వామివారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. పదో రోజైన 27వ తేదీ వినాయక చవితి సందర్భంగా స్వర్ణ మూషిక వాహనంపై కర్పగ వినాయకుడిని ఆలయ మాడవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో తీర్థవారీ ఉత్సవం నిర్వహిస్తారు. ఆ తర్వాత మూలవర్‌కు భారీ సైజులో తయారుచేసిన ఉండ్రాళ్ళు, కుడుములు నివేదించి, రాత్రి పంచమూర్తుల ఊరేగింపుతో వినాయక చవితి వేడుకలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



స్వామివారి ఊరేగింపు

కనిమొళికి పెరియార్ అవార్డు



చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యురాలు, డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కనిమొళి పెరియార్ అవార్డుకు ఎంపికయ్యారు. కరూరులో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న డీఎంకే 'ముప్పెరుం విళా'లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నన్నారు. ప్రతియేటా డీఎంకే ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15న డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతి, 16న పార్టీ ఆవిర్భావ దినం, 17న పెరియార్ జయంతిని ముప్పెరుం విళా పేరుతో జరుపుకోవడం ఆనవాయితీ. ఆ సందర్భంగా విశిష్ట సేవలందించినవారికి అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఆ ప్రకారం ఈ యేడాదికిగా పెరియార్ అవార్డుకు కనిమొళిని ఎంపిక చేశారు. ఇదే విధంగా పాళయంకోట పురపాలక సంఘం మాజీ అధ్యక్షుడు సుబ. సీతారామన్‌కు అన్నా అవార్డు, అన్నానగర్ మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఎం. రామచంద్రన్‌కు కలైంజర్ అవార్డు, కుళిత్తలై పారీ నాయకుడు శివరామన్‌కు పావేందర్ అవార్డు, మాజీ విప్, కాట్టుమన్నార్‌కోవిల్ మాజీ ఎమ్మెల్యే మరుదూరు రామలింగంకు పేరాసియర్ అవార్డు స్వీకరించనున్నారు. కరూరులో జరుగనున్న వేడుకలలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

ఆకట్టుకున్న సంప్రదాయ వాయిద్యాల ప్రదర్శన



వివిధ రకాల బాకాలను తిలకిస్తున్న విద్యార్థులు



డప్పును పరిశీలిస్తున్న బాలికలు

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూరు మ్యూజియంలో ఆదివారం ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రాచీన సంప్రదాయ వాయిద్యాల ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంది. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శన చూసేందుకు ఉదయం నుండే మ్యూజియంకు చేరుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరునాళ్లలో వాయించే డప్పు, డోలు, సన్నాయి, బాకా సహా సుమారు 250కి పైగా వాయిద్య పరికరాలు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు ఇత్తడి వాయిద్య పరికరాలను చూసి విస్తుపోయారు. ప్రతి వాయిద్య పరికరం కింద దాని వివరాలను కూడా ఎగ్జిబిషన్ అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిశ్శబ్దం రాజ్యమేలే ఎగ్మూరు మ్యూజియంలో జానపద వాయిద్య పరికరాల ప్రదర్శన వీక్షించడానికి నగరం నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులతో సందడి నెలకొంది.



సన్నాయిలాంటి వాయిద్య పరికరం లోపల ఏముందోనని చూస్తున్న బాలుడు

దేశంలో తొలి 'వందే భారత్ పార్శిల్' రైలు

● ఒకే సమయంలో 264 టన్నుల సామర్థ్యం



పెరంబూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి 'వందే భారత్ పార్శిల్' రైలు సిద్ధమైంది. ఈ రైలులో 264 టన్నుల సరుకులు తీసుకెళ్లవచ్చని ఐసిఎఫ్ అధికారులు తెలిపారు. ఐసిఎఫ్‌లో తయారుచేసిన 'వందే భారత్' రైళ్లకు ప్రయాణికుల ఆదరణ లభిస్తోంది. అదే సాంకేతిక పరిజ్ఞానంతో సరుకులు కూడా తీసుకెళ్లేలా ప్రత్యేక అంశాలతో వందే భారత్ పార్శిల్ రైలు తయారీ గత ఏడాదిగా ఐసిఎఫ్‌లో జరుగుతోంది. ప్రస్తుతం ఈ రైలు తయారు పనులు తుదిదశకు చేరుకున్నాయి. మొత్తం 16 బోగీలతో కూడిన ఈ రైలు గంటకు 160 కి.మీ సామర్థ్యం కలిగి ఉంది. ఆహార పదార్థాలు, సరుకులు ప్రత్యేకంగా భద్రపరిచే వసతులు ఉన్నాయి. ఆన్‌లైన్ సంస్థలు తమ ఉత్పత్తులు పంపేందుకు అధికంగా విమానాలను ఆశ్రయిస్తున్న నేపథ్యంలో, వందే భారత్ పార్శిల్ రైలు సేవలు ఆన్‌లైన్, ఎగుమతుల సంస్థలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, మరో ఒకటి, రెండు నెలల్లో ఈ పార్శిల్ రైలు సేవలు అందుబాటులోకి వస్తాయని ఐసిఎఫ్ అధికారులు తెలిపారు.

పళ్లిపట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తిరుత్తణి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పరిధిలోని వడకుప్పం, బొమ్మరాజుపేట, నొచ్చిలి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎంకే పార్టీ మండల కార్యదర్శి బీడీ.చంద్రన్ ఆదివారం ప్రారంభించారు. ఈ ఏడాదికి సంబంధించిన ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ అధికారులకు గత శనివారం ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో, పళ్లిపట్టు చుట్టు పక్కల సుమారు 50 గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు ఆ ప్రాంత ఫుడ్ కార్పొరేషన్ అధికారులు సన్నాహాలు చేశారు. దీనితో ఆదివారం ఉదయం డీఎంకే పార్టీ మండల కార్యదర్శి బీడీ. చంద్రన్ ఆధ్వర్యంలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రాజు, వరి కొనుగోలు కేంద్రం అధికారి మణి, స్థానికులైన రైతులు లోకేశ్వరన్, అప్పాస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ రోడ్డులో నవీన్స్ లగ్జరీ రెసిడెన్స్ ప్రారంభం



లగ్జరీ రెసిడెన్స్ ప్రారంభంలో నవీన్ కుమార్, అను శ్రీరామ్ తదితరులు

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన నవీన్స్. ఏయూఎం గృహ ప్రమోటర్స్ ఎల్‌ఎల్‌పీ సహకారంతో నగరంలో ఐకానిక్ ల్యాండ్ మార్క్‌గా లగ్జరీ రెసిడెన్స్ ప్రారంభించింది. తొమ్మిది అంతస్తుల్లో త్రీ బీహెచ్‌కేలతో వీటిని డిజైన్ చేశారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత నవీన్స్ ఎండీ నవీన్ కుమార్ మాట్లాడుతూ, నగరంలోని కాలేజీ రోడ్డులో ఏయూఎం గృహ ప్రాజెక్టుతో నవీన్స్ అనుబంధాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు ఈ ప్రాజెక్టులోని ప్రతి ఇల్లు తగినంత గాలి, వెలుతురు, పూర్తి గోప్యతతో నిర్మించినట్టు వెల్లడించారు. ప్రకృతి అందాలతో కూడిన టెర్రస్ ఉందని, ఇది విశ్రాంతి తీసుకోవడానికి ఎంతో అనువుగా ఉంటుందన్నారు. ఏయూఎం గృహ ప్రమోటర్స్ ఎల్‌ఎల్‌పీ సహ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ అను శ్రీరామ్ మాట్లాడుతూ, విలాసవంతమైన లగ్జరీ ఫ్లాట్స్ కొనుగోలుదార్లకు అవకాశం కల్పించే ఈ ఐకానిక్ ప్రాజెక్టులో నవీన్స్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.

తమిళనాడు కిడ్నీ ఫౌండేషన్‌కు జీఆర్‌టీ రూ.కోటి విరాళం



విరాళ పత్రాన్ని చూపుతున్న దృశ్యం

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో అగ్రస్థాయి ఆభరణాల తయారీ సంస్థల్లో ఒకటైన జీఆర్‌టీ జ్యువెలర్స్ తన సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా తమిళనాడు కిడ్నీ ఫౌండేషన్‌కు కోటి రూపాయలను విరాళంగా అందజేసింది. సమాజ సేవ, వివిధ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు జీఆర్టీ తనవంతుగా భారి విరాళాలను అందిస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా తమిళనాడు కిడ్నీ ఫౌండేషన్‌కు రూ.కోటి విరాళాన్ని అందజేసింది. ఈ సందర్భంగా జీఆర్టీ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ మాట్లాడుతూ, మా విజయాలను ఇతరులతో కలిసి పంచుకున్నపుడే అర్థవంతమైందని తాము నమ్ముతామన్నారు. దశాబ్దాలుగా మమ్మల్ని విశ్వసించి మద్దతిస్తున్న అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞత చూపించడానికి ఇది సరైన మార్గంగా భావిస్తున్నామన్నారు. జీఆర్‌టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ, తమకు వ్యాపారంతో పాటు సమాజ సేవలోనూ విడదీయరాని అనుబంధం ఉందన్నారు.

గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో 'డయాబెటిస్ ఎవల్యూషన్'పై సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ అఫ్రిన్ షబ్బీర్

అడయార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో 'డయాబెటిస్ ఎవల్యూషన్' (సీవోడీఈ 2025) పె సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు700 మంది వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, పరిశోధకులు, విధాన నిపుణులు తదితరులు హాజరై డయాబెటిస్ సంరక్షణ నైపుణ్యం, అభివృద్ధి చెందుతున్న ధోరణి, భవిష్యత్ నివారణ చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సదస్సును గ్లెనీగల్స్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఇందులో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అశ్విన్ కరుప్పన్, సీఓడీఈ 2025 ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ అఫ్రిన్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సన్ బీమ్ పాఠశాలలో 'స్పోర్ట్స్ డే'

వేలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సన్ బీమ్ మెట్రిక్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం 'స్పోర్ట్స్ డే' నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మెన్ డా.హరిగోపాలన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ మయిల్‌వాహనన్ పాల్గొని స్పోర్ట్స్ డే వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డా.తంగప్రకాష్, డా.జార్జి, అరవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలు అందిస్తున్న ఎస్పీ మయిల్‌వాహనన్

హొగేనకల్‌లో పెరిగిన రద్దీ

● దోనె సవారీకి బారులు తీరిన పర్యాటకులు



జలపాతంలో దోనెలపై సవారీ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం హొగేనకల్‌లో ఆదివారం ఉదయం వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ధర్మపురి, సేలం, కృష్ణగిరి తదితర జిల్లాల నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రల నుండి కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆ జలపాతం వద్ద సందడి నెలకొంది. జలపాతంలో స్నానం చేయడానికి దోనెలపై సవారీ చేయడానికి బారులు తీరారు. పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరగటంతో జలపాతం వద్ద వేపుడు చేపల విక్రయించే తాత్కాలిక దుకాణాలు వందల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. జలపాతం వద్ద సినీ ఫాల్స్ వద్ద పర్యాటకులు గుంపులు గుంపులుగా నిలిచి ప్రకృతి సౌందర్యాలను వీక్షించారు.

మాతంగేశ్వరి ఆలయంలో మండలాభిషేకాలు ప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ ప్రాంతంలో ఆదిఆంధ్రులు అధికంగా నివసిస్తున్న స్వతంత్రనగర్‌లో కొలువుదీరిన మాతంగేశ్వరి ఆలయంలో మండలాభిషేక పూజలు ఆదివారం ఉదయం ప్రారంభించి అమ్మవారికి విశేష పూజలు చేశారు. 40 రోజుల పాటు జరిగే ఈ పూజల సందర్భంగా అమ్మవారిని ప్రతిరోజు విశేషంగా అలంకరించి దీపారాధన చేయనున్నారు. శనివారం పుష్కర కుంభాభిషేకం సందర్భంగా రాత్రి నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో స్వతంత్ర నగర్ ఆదిఆంధ్ర ప్రజా సంక్షేమ సంఘ నిర్వాహకులు మొండెం కృష్ణమూర్తి, ఉద్దాల హరి, కాకి శ్రీనివాస్, టీఎల్ వెంకటయ్య అలియాస్ అబ్దుల్, కప్పల విష్ణుప్రసాద్, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, యువత పాల్గొని భజనగీతాలు ఆలపిస్తూ నృత్యం చేస్తూ సందడి చేశారు.



యాళి వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

ఎన్డీయే కూటమి సీఎం అభ్యర్థి ఈపీఎస్

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్



మీడియాతో మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సీఎం అభ్యర్థి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ మరోమారు స్పష్టం చేశారు. నగరం నుండి ఆదివారం తిరుచ్చి వెళ్లిన ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ 1,600 మంది ఎమ్మెల్యేలు, 330 మంది పార్లమెంట్ సభ్యులు కలిగిన అతిపెద్ద పార్టీ అని, ఈ పార్టీ అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచ దేశాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. తమిళనాడులో బీజేపీకి చెప్పుకోదగ్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు లేరని పలువురు విమర్శిస్తున్నారని, ఎక్కువ మంది ఎమ్మెల్యేలు, ఎంపీలున్న డీఎంకే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పలుమార్లు అధికారంలో ఉండి రాష్ట్రం కోల్పోయిన హక్కులను సాధించలేక చతికిలబడిందని వ్యాఖ్యానించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఎవరి అదుపులో లేరని, ఆయన స్వేచ్ఛాగా ఉన్నారని, అయితే ఆయన గురించి ఒక్క తమిళ నాయకులు మాత్రమే దుష్ప్రచారం సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధ్యక్షుడు ఈపీఎస్ అని, సంకీర్ణ ప్రభుత్వం గురించి ఆయనే నిర్ణయం తీసుకుంటారని, తమ కూటమి సీఎం అభ్యర్థి కూడా ఆయనేనని స్పష్టంచేశారు.